క్లుప్తంగా

కొవ్వూరులో ఉచిత వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న కౌన్సిలర్ అక్షయపాత్ర శ్రీనివాస రవీంద్ర

కొవ్వూరు: డాక్టర్ రెడ్డి ల్యాబ్స్ ఆధ్వ ర్యంలో కొవ్వూరు పురపాలక సంఘ కార్యాలయం వద్ద బుధవారం ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. బీపీ, షుగర్ పరీక్షలు చేశారు. జ్వరం, దగ్గు, అసిడిటీ, నొప్పుల గురించి వివరాలు అడిగి నమోదు చేశారు. కాగా బుధవారం నిర్వహించిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశానికి హాజరైన సభ్యులు, ఇతరు లకు, పురపాలక సంఘం సిబ్బందికి బీపీ, షుగర్ టెస్టులు ఉచితంగా నిర్వహించారు.

దిష్టిబొమ్మ దహనం

నిడదవోలు: పట్టణంలోని బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద బుధవారం కుల ఉన్మాదం, మతోన్మాదం దిష్టి బొమ్మను దహనం చేశారు. కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి జువ్వల రాంబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గండి శ్రీనివాసరావు, జి.డానియల్, గారపాటి ప్రసన్నకృష్ణ, యర్రా శ్రీనివాస్, రసూల్, ఉస్మాన్, టి. నాని, సర్వేశ్వరరావు, టి.సుధాకర్, టి. నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పలక, బలపాల పంపిణీ

నిడదవోలు: మండలంలోని శింగవరం, శెట్టిపేట, తాళ్లపాలెం, అట్లపాడు సమిశ్రగూడెం, డి. ముప్పవరం ప్రాథమిక పాఠశాలల ఒకటో తరగతి విద్యార్థులకు రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు శాఖ ఆధ్వర్యంలో బుధవారం పలకలు, బలపాలు పంపిణీ చేశారు. రొటేరియన్ గొన్నాబత్తుల రామారావు ఆర్థిక సాయంతో వాటిని అందించారు. క్లబ్ అధ్యక్షుడు కీర్తి ఆంజనేయులు, రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ పాలాదాసు శ్రీనివాసరావు, కార్యదర్శి గుంటుపల్లి వెంకట నాగ శివకుమార్, కోశాధికారి కాళ్ళ రాంబాబు, కమ్యూనిటీ సర్వీసెస్ డైరెక్టర్ కేదారిశెట్టి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

ఉండ్రాజవరం: ఉండ్రాజవరం ఉన్నత పాఠశాలను ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి బుధవారం సందర్శించారు. మధ్యాహ్న భోజనాన్ని, వంట సరుకులను పరిశీలించారు. విద్యార్థులతో కలసి ఆమె భోజనం చేశారు. వంటకాల రుచిగా ఉంటున్నాయా, జగనన్న విద్యా కానుక కిట్లు తీసుకున్నారా? ఉపాధ్యాయులు చెప్పే పాఠాలు అర్థం అవుతున్నాయా? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంఈవో సక్సేనా రాజు తదితరులు పాల్గొన్నారు.

'మానవత' సేవలను రాష్ట్ర వ్యాప్తంగా విస్తరిస్తాం

దేవరపల్లి: మానవత స్వచ్ఛంద సంస్థ సేవలను రాష్ట్ర వ్యాప్తంగా విస్తరిస్తామని రాష్ట్ర కన్వీనర్ (విస్తరణ, అభివృద్ధి) బలుసు సత్యనారాయణ తెలిపారు. రాష్ట్ర కన్వీనర్‌గా నియమితులైన మండలంలోని పల్లంట్లకు చెందిన ఆయన బుధవారం దేవరపల్లిలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రర కన్వీర్‌తో పాటు విశాఖ జిల్లా ఇన్‌చార్జ్‌గా బలుసు సత్యనారాయణను నియమిస్తూ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్. రామచంద్రారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ఐదేళ్లుగా మానవత స్వచ్ఛంద సేవా సంస్థలో తాను కొనసాగుతున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో నూతన శాఖల ఏర్పాటుకు కృషి చేస్తానని చెప్పారు. తన సొంత నిధులు రూ.5 లక్షలతో నిధి ఏర్పాటు చేసి అనాథ మృతదేహాల దహన సంస్కారాలకు ఖర్చు చేస్తానని ప్రకటించారు.

నేడు నులి పురుగుల నివారణ మాత్రల పంపిణీ

కొవ్వూరు: జాతీయ నులి పురుగుల దినోత్సవం సందర్భంగా గురువారం దొమ్మేరు పీహెచ్‌సీ పరిధిలోని అన్ని హెల్త్ క్లినిక్‌లల్లోను ,అంగన్‌వాడీ కేంద్రాల్లోను, పాఠశాలలు, కళాశాలల్లోను అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు వైద్యాధికారి ఎస్.ధర్మరాజు తెలిపారు. ఒకటి నుంచి 19 ఏళ్ల లోపు వయస్సు కలిగిన వారందరికి ఈ మాత్రలు అందిస్తామన్నారు. దొమ్మేరు, సావరం, కాపవరం, పెనకనమెట్ట, ఆరికిరేవుల, నందమూరు, పశివేదల-1, 2, వాడపల్లి 1,2లలోను, వేములూరు, తోగుమ్మి హెల్త్ క్లినిక్కుల్లో వాటిని అందజేయనున్నట్లు తెలిపారు. ఏ కారణం చేతనైనా మాత్రలు వేసుకోని వారు ఉంటే, వారికి ఆగస్టు 17న అందిస్తామన్నారు.

పల్లెల్లో ఎన్నికల కోలాహలం

- పంచాయతీ వార్డులకు ఉప ఎన్నికలు
- నేటితో ముగియనున్న నామినేషన్ల ఘట్టం
- డివిజన్‌లో ఖాళీగా తొమ్మిది వార్డులు
- తొలి రోజు రెండు, మలి రోజు రెండు నామినేషన్ల దాఖలు
- 19న పోలింగ్, అదే రోజున ఫలితాల వెల్లడి



గోపాలపురం పంచాయతీ 16వ వార్డు మెంబర్ పదవికి బుధవారం నామినేషన్ దాఖలు చేస్తున్న సనమండ్ర బాబూరావు

కొవ్వూరు: పంచాయతీ వార్డు మెంబర్ల ఉప ఎన్నికతో గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది. కొవ్వూరు డివిజన్‌లోని ఆరు మండలాల పరిధిలో తొమ్మిది వార్డు సభ్యుల ఉప ఎన్నికలకు గురువారం సాయంత్రం ఐదు గంటలతో నామినేషన్ ప్రక్రియ ముగియనుంది. వివిధ కారణాలతో ఖాళీ అయిన వార్డు సభ్యుల భర్తీకి ఎన్నికలకు అధికారులు ఇప్పటికే నోటిఫికేషన్ జారీ చేశారు. మేజర్ పంచాయతీ అయిన గోపాలపురంలో 12,16 వార్డులకు, నిడదవోలు మండలం పురుషోత్తపల్లి పంచాయతీలో 7,9 వార్డులకు, కాటకోటేశ్వరంలో ఒకటో వార్డుకు, ఉండ్రాజవరం మండలం దమ్మెన్నులో తొమ్మిదో వార్డుకు, కె.సావరం పంచాయతీలో 11వ వార్డుకు, కొవ్వూరు మండలం ఐ.పంగిడి పంచాయతీలో ఎనిమిదో వార్డుకు, పెరవలి మండలం అజ్జరం పంచాయతీలో రెండో వార్డుకు ఉప ఎన్నికలకు వీలుగా నోటిఫికేషన్ జారీ చేశారు. తొలి రోజు కొవ్వూరు మండలం ఐ.పంగిడిలో ఎనిమిదో వార్డుకు రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. రెండో రోజు మొత్తం తొమ్మిది వార్డు మెంబర్లకు రెండు నామినేషన్లు మాత్రమే దాఖలయ్యాయి.

19న ఉప ఎన్నికలు....షెడ్యూల్ ఇలా...

పంచాయతీ వార్డు సభ్యుల ఉప ఎన్నికకు ఈ నెల 19న పోలింగ్ నిర్వహించనున్నారు.నామినేషన్ల ప్రక్రియ గురువారం సాయంత్రం ఐదు గంటలతో ముగుస్తుంది 11న నామినేషన్ల పరిశీలన, 12న తిరస్కరణకు గురైన నామినేషన్లు ఉంటే ఆర్డీవోకు అప్పీలు అవకాశం కల్పించారు. 13న అప్పీల్ అయిన నామినేషన్ డిస్పోజల్ చేస్తారు. 14వ తేదీ మధ్యాహ్నం మూడు గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఇచ్చారు. 19వ తేదీ ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ పోలింగ్ నిర్వహిస్తారు. అదే రోజు మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఓట్ల లెక్కింపు జరుపుతారు. లెక్కింపు ముగిసిన వెంటనే ఫలితాలను వెల్లడిస్తారు.

స్టేజ్-1 అధికారులు వీరే

డివిజన్‌లో నామినేషన్ ప్రక్రియ నిర్వహణకు స్టేజ్-1 అధికారులను నియమించారు. నిడదవోలు మండలం పురుషోత్తపల్లికి శెట్టిపేట హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు బీవీ రవికుమార్, దమ్మెన్నుకు తాడిపర్రు గరల్స్ -2 స్కూల్ హెచ్ఎం కె.సరోజిని, కె.సావరం పంచాయతీకి ఉండ్రాజవరంలోని గరల్స్ -2 హైస్కూలు హెచ్ఎం బి.విశ్వ ప్రసాద్, గోపాలపురం పంచాయతీకి అదే గ్రామంలోని హైస్కూలు హెచ్ఎంగా పని చేస్తున్న పి.సోమశేఖర్‌ను, కొవ్వూరు మండలం ఐ.పంగిడి పంచాయతీ వార్డు సభ్యుల నామినేషన్ ప్రక్రియకు ఎంఈవో కేఆర్ కిషోర్, అజ్జరం పంచాయతీకి కాకరపర్రు హైస్కూల్ హెచ్ఎం కె.శ్రీరామచంద్రమూర్తి, కాటకోటేశ్వరం పంచాయతీ ఉప ఎన్నికకు పెండ్యాల హైస్కూల్ హెచ్ఎం పి.విఘ్నేశ్వరరావును స్టేజ్-1 అధికారులుగా నియమించారు.

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత



దుర్గకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు అందిస్తున్న హోం మంత్రి తానేటి వనిత

కొవ్వూరు: ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి చాగల్లు ఇందిరమ్మ కాలనీకి చెందిన మంగరాయి దుర్గకు అందిన రూ.2 లక్షల ఆర్థిక సాయం చెక్కును హోం మంత్రి తానేటి వనిత బుధవారం ఆమెకు అందజేశారు. కొవ్వూరులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రి ఈ చెక్కు అందజేశారు. గతేడాది జూన్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్గ భర్త మంగరాయి వెంకటేష్ మృతి చెందారు. ఈమెకు కుమారుడు, కుమార్తె సంతానం. ఆ కుటుంబానికి అండగా ఉండాలన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి ఈ ఆర్థిక సాయం విడుదల చేసినట్లు మంత్రి తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ చాగల్లు మండల శాఖ అధ్యక్షుడు చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు, దారవరం సర్పంచ్ మద్దూకూరి రవిప్రసాద్, మల్లవరం మాజీ సర్పంచ్ లంకసాని సూర్యప్రకాశరరావు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకూ మేలు చేకూరేలా పాలన

- హోం మంత్రి తానేటి వనిత
- కొవ్వూరు 18వ వార్డులో గడప గడపకూ..



కొవ్వూరు 18వ వార్డు వాసులకు పథకాల లబ్ధిని వివరిస్తున్న హోం మంత్రి తానేటి వనిత



ముక్కామలలో మహిళలు, విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు

కొవ్వూరు: రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకూ మేలు చేకూర్చేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని హోం మంత్రి తానేటి వనిత అన్నారు. కొవ్వూరు పట్టణంలోని 18వ వార్డులో బుధవారం రాత్రి ఆమె గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి ఇంటింటికీ వెళ్లి గత నాలుగేళ్ల పాలనలో ఆయా కుటుంబాలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల లబ్ధి గురించి వివరించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మునిసిపల్ వైస్ పర్సన్‌లు మన్నె పద్మ, గండ్రోతు అంజనీదేవి, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖ, పార్టీ పట్టణ శాఖ గౌరవాధ్యక్షుడు నగళ్లపాటి శ్రీనివాస్, మండల శాఖ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ, ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభశెట్టి గంగాధర శ్రీనివాస్, మహిళా విభాగం అధ్యక్షురాలు ఏలూరి విజయలక్ష్మి, దొమ్మేరు సొసైటీ అధ్యక్షుడు ముదునూరి సూర్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

ముక్కామలలో ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు

పెరవలి: పేదల సంక్షేమం కోసమే ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెడుతోందని నిడదవోలు ఎమ్మెల్యే జి. శ్రీనివాస్ నాయుడు అన్నారు. మండలంలోని ముక్కామల గ్రామంలో రెండో రోజు బుధవారం కూడా ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలసి గ్రామంలో ఆయన పర్యటించారు. ప్రజలను ఆప్యాయంగా పలకరించి, పథకాలు అందుతున్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వాటిని పరిష్కరించాలని వెంట ఉన్న అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత ఉంటే తమ ప్రభుత్వంలో ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు నడుచుకుంటూ వస్తాయన్నారు. ఏదో ఒక పథకం ద్వారా ముక్కామల గ్రామంలో గత నాలుగేళ్లలో ప్రతి ఇంటికీ రూ.50 వేల నుంచి రూ. 5 లక్షల వరకూ లబ్ధి చేకూరిందన్నారు. గతంలో గోదావరి వరదల వలన నష్టపోయిన అరటి రైతులకు నష్టపరిహారం అందించామని ఎమ్మెల్యే చెప్పారు.

టీడీపీ పాలన అంతా దోచుకో-దాచుకో అన్నట్టుగా సాగిందని విమర్శించారు. కానీ జగన్ ప్రభుత్వంలో అవినీతికి ఆస్కారం లేకుండా ఆర్థిక ఫలాలు లబ్ధిదారుల ఖాతాల్లోకి నేరుగా అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు వీరమళ్ళ సత్యనారాయణ ,సర్పంచ్ కేతా త్రిమూర్తులు, ఎంపీటీసీ సభ్యులు గండేపల్లి రామకృష్ణ, వేండ్ర శ్రీనువాస్, సొసైటీ అధ్యక్షులు రేలంగి ఏసు, ఎంపీడీఓ దామోదరరావు తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక,సాంస్కృతిక శాఖకు స్థలం కేటాయింపు

- కొవ్వూరు కౌన్సిల్ అత్యవసర సమావేశం తీర్మానం



చైర్‌పర్సన్ రత్నకుమారి

కొవ్వూరు: పట్టణంలోని ఏటిగట్టుపై ఉన్న 15 సెంట్ల స్థలాన్ని యువత అభివృద్ధి, పర్యాటక, సాంస్కృతిక శాఖ కేంద్రం ఏర్పాటుకు కేటాయిస్తూ పురపాలక సంఘంలో తీర్మానం చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి అధ్యక్షతన బుధవారం కౌన్సిల్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గత నెలలో నిర్వహించిన కౌన్సిల్ సమావేశపు అజెండాలో ఈ అంశం కూడా ఉంది. సభ్యుల సూచనలతో అప్పట్లో ఈ అంశాన్ని రద్దు చేశారు. అయితే టూరిజం అండ్ కల్చరల్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అభ్యర్థన మేరకు జిల్లా కలెక్టర్ ఆదేశాలు చేశారు. దీంతో పురపాలక సంఘంలో పదిహేను సెంట్ల స్థలాన్ని యువత అభివృద్ధి, పర్యాటక, సాంస్కృతిక కేంద్రానికి కేటాయిస్తూ కౌన్సిల్ ఆమోదం తెలిపింది. మున్సిపల్ కమిషనర్ బి.శ్రీకాంత్ మాట్లాడుతూ అజాదీకా అమృత్ ఉత్సవ్‌లో భాగంగా ఈనెల 9 నుంచి 15 వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ప్రకటించారు. ప్రధాని సందేశాన్ని తెలియజేసే శిలా ఫలాన్ని కార్యాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. భారత 75వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ప్రత్యేకంగా నిర్వహిస్తే బాగుటుందని కౌన్సిలర్ అక్షయపాత్ర శ్రీనివాస రవీంద్ర సూచించారు.వైస్ చైర్ పర్సన్‌లు మన్నె పద్మ, గండ్రోతు అంజనీదేవి, మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆడబిడ్డల వివాహానికి ఆర్థిక భరోసా

- ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- కల్యాణ మస్తు, షాదీ తోఫా చెక్కుల పంపిణీ



కల్యాణమస్తు, షాదీతోఫా పథకాల లబ్ధిదారులకు చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

నిడదవోలు: పేదింటి ఆడబిడ్డల వివాహాలకు అండగా నిలిచేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వైఎస్సార్ కల్యాణ మస్తు, వైఎస్సార్ షాదీ తోఫా పథకాలను అమలు చేస్తోందని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. ఈ రెండు పథకాల లబ్ధిదారులకు బుధవారం ఆయన నగదు చెక్కులు పంపిణీ చేశారు. నియోజకవర్గంలోని 97 మంది లబ్ధిదారులకు రూ.72.45 లక్షల విలువైన చెక్కులు అందజేశారు. పట్టణంలోని రాయిపేట సచివాలయంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో ఈ పథకాన్ని ప్రవేశపెట్టి సవా లక్ష నిబంధనలతో అరకొరగా సాయం అందించారన్నారు. టీడీపీ ప్రభుత్వంలో కంటే రెండింతల ఆర్థిక సాయాన్ని పెంచి జగన్ ప్రభుత్వం పేరుతో పేదింటి ఆడపిల్లల వివాహానికి సాయం అందిస్తోందన్నారు. గత నాలుగేళ్లలో నియోజకవర్గంలోని 240 మందికి ఈ రెండు పథకాల ద్వారా లబ్ధి చేకూర్చామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్లు గంగుల వెంకటలక్ష్మి, యలగాడ బాలరాజు, కౌన్సిలర్లు కామిశెట్టి సత్యనారాయణ, బిర్రె పార్వతి, కొత్తపల్లి సుప్రియ, ఎండీ షకీరాబేగం, పడాల శిరీష, ఆకుల ముకుందరావు, అహ్మదున్నీసాబేగం, మొదలవలస నాగమణి, చిలకల శారదాదేవి, ఆలమూరి భారతి, దాకే అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలు రూరల్: పేదింటి ఆడ పిల్లలకు గౌరవప్రదంగా వివాహం చేసుకునేందుకు ప్రభుత్వం వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీతోఫా ద్వారా ఆర్థిక సాయం అందజేస్తోందని ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని పందలపర్రు సచివాలయం వద్ద లబ్ధిదారులైన నూతన వధూవరులకు వైఎస్సార్ కల్యాణమస్తు మంజూరు పత్రాలను ఆమె అందజేశారు. సర్పంచ్ పులుమంతుల నాగదుర్గ, వైఎస్సార్ సీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేల తల్లికి నమస్కారం.. వీరులకు వందనం



నిడదవోలు మండలం పందలపర్రులో జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కొవ్వూరు/నిడదవోలు రూరల్/ఉండ్రాజవరం/పెరవలి/చాగల్లు: అజాదీకా అమృత్ మహోత్సవ్ కింద బుధవారం కొవ్వూరు డివిజన్ వ్యాప్తంగా నా భూమి, నా దేశం కార్యక్రమం నిర్వహించారు. నేల తల్లికి నమస్కారం, వీరులకు వందనం కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన శిలా ఫలకాలను ఆవిష్కరించారు. కొవ్వూరు మండలం కాపవరంలో సర్పంచ్ సుంకర పద్మిని ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.రిటైర్డు ఆర్మీ అధికారి షేక్ జహంగీర్ బాషాను సత్కరించారు. నిడదవోలు మండలం పందలపర్రులో ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్వాతంత్ర్య సమరయోధుల స్థూపం వద్ద నివాళులర్పించారు. గ్రామంలో జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. ఉండ్రాజవరం నంబర్-1 ప్రాథమిక పాఠశాల వద్ద, మండలంలోని పలు గ్రామ సచివాలయాల వద్ద ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు శిలా ఫలకాలను ఆవిష్కరించారు. అలాగే పెరవలి మండలం పిట్టల వేమవరంలో సర్పంచ్ మండ హైమావతి అధ్యక్షతన మహాత్మా గాంధీ విగ్రహానికి ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఎంపీడీఓ దామోదరరావు, పంచాయతీరాజ్ ఏఈ రామచంద్రారెడ్డి మొక్కలు నాటారు. చాగల్లు పంచాయతీ కార్యాలయం వద్ద 'ఆత్మ' చైర్మన్ గండ్రోతు సురేంద్రకుమార్, వైఎస్సార్ సీపీ మండల శాఖ గౌరవాధ్యక్ష, అధ్యక్షులు చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు, జుట్టా కొండలరావు, సర్పంచ్ ఉన్నమట్ల మనశ్శాంతి, ఎంపీడీవో బి. రాంప్రసాద్, తహసీల్దార్ కె.రాజ్యలక్ష్మి కొబ్బరి మొక్కలు నాటారు. అలాగే బ్రాహ్మణగూడెంలో నిర్వహించిన కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు ఆత్కూరి దొరయ్య, సర్పంచ్ గురువెల్లి కుమారి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పలువురికి 'మానవత ' ఆర్థిక సాయం

నల్లజర్ల: అనారోగ్యంతో బాధపడుతున్న మండలంలోని అచ్చన్నపాలేనికి చెందిన ముమ్మిడివరపు కృష్ణమాచార్యులుకు బుధవారం మానవత సంస్థ మండల రూ.4 వేల ఆర్థిక సాయం చేసింది. అదే గ్రామానికి చెందిన పాతూరి సత్యనారాయణరూ వేయి, పాతూరి రమేష్‌కు రూ.500, ఆదినారాయణకు రూ.500, ప్రత్తిపాటి గంగాధరరావుకు రూ.500, నందం రాజేంద్రప్రసాద్‌కు రూ.500, వి.కామేశ్వరరావుకు రూ.500 మొత్తం రూ.7,500 సాయంగా అందజేశారు. కార్యక్రమంలో ఆ సంస్థ మండల శాఖ అధ్యక్షుడు ఐడీవీ అప్పారావు, సభ్యులు పాల్గొన్నారు.

గోపాలపురంలో రెండు నామినేషన్ల దాఖలు

గోపాలపురం: గోపాలపురం పంచాయతీ పరిధిలో ఖాళీగా ఉన్న వార్డు మెంబర్ల పదవులకు రెండో రోజు బుధవారం మూడు నామినేషన్లు దాఖలయ్యాయి.16వ వార్డుకు సనమండ్ర బాబురావు నామినేషన్ దాఖలు చేశారు. పంచాయతీ కార్యాలయంలో ఆర్‌వో పి.సోమ శేఖర్‌కు ఆయన నామినేషన్ పత్రాలు అందజేశారు.వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు. అలాగే టీడీపీ బలపరిచిన కొడవటి వెంకటేశ్వరరావు రెండు సెట్లు నామినేషన్ దాఖలు చేశారు.

నిడదవోలు మండలంలో నిల్..

నిడదవోలు రూరల్: మండలంలోని పురుషోత్తపల్లి 7,9 వార్డులకు, కాటకోటేశ్వరం 1వ వార్డుల ఉప ఎన్నికలకు రెండోరోజైన బుధవారం కూడా ఒక్క నామినేషన్ దాఖలు కాలేదని ఎంపీడీఓ పి.శామ్యూల్ తెలిపారు. గురువారంతో నామినేషన్ల స్వీకరణ ఘట్టం ముగియనుంది. ఆయా గ్రామాల్లోని నాయకులు వార్డు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకునేందుకు కసరత్తు చేస్తున్నారు.

గృహ లబ్ధిదారులకు అండగా ప్రభుత్వం

- గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- అనంతపల్లిలో 260 మందికి ఇళ్ల పట్టాల పంపిణీ



లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

నల్లజర్ల: లబ్ధిదారులు గృహ నిర్మాణాలకు ముందుకు వస్తే ప్రభుత్వం అన్నివిధాలా ఉండగా ఉంటుందని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. అనంతపల్లి గ్రామంలోని కుమ్మర్ల బజారులో ఎనిమిది ఎకరాల విస్తీర్ణంలో 260 మంది లబ్ధిదారులకు బుధవారం ఆయన ఇళ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తలారి మాట్లాడుతూ పట్టాలు పొందిన వారందరూ ఇళ్ల నిర్మాణం చేపట్టాలన్నారు. ఇదే గ్రామంలో ఒక చోట 40 మంది, మరో చోట 100 మంది పేదల కోసం భూ సేకరణ జరిగిందన్నారు. వారికి కూడా కొద్ది రోజుల్లోనే పట్టాలు అందించే ఏర్పాటు చేస్తామన్నారు. ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం ముందస్తుగా రూ.20 వేలు జమ చేస్తుందన్నారు. పోతవరం, చీపురుగూడెం, ఆవపాడు తదితర గ్రామాల్లో చేపట్టిన నిర్మాణాలు గృహ ప్రవేశాలకు సిద్ధం అవుతున్నాయని ఎమ్మెల్యే చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిశోర్‌కుమార్, పంచాయతీ సర్పంచ్ కమలకుమారి, ఉప సర్పంచ్ కలం సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు యడ్లపల్లి మార్త, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గగ్గర శ్రీనివాస్, సొసైటీ అధ్యక్షుడు కారుమంచి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి



సమిశ్రగూడెం పీహెచ్‌సీలో గర్భిణులకు పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి అమరేంద్ర

నిడదవోలు రూరల్: గర్భిణులు పోషక విలువలు గల ఆహారాన్ని తీసుకోవాలని మండల వైద్యాధికారి ఎ.అమరేంద్ర సూచించారు. ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్‌లో భాగంగా మండలంలోని సమిశ్రగూడెం పీహెచ్‌సీలో బుధవారం గర్భిణులకు ప్రత్యేక వైద్య పరీక్షలు చేశారు. రక్తహీనత, కాన్పులపై వారికి శుక్రవారం అవగాహన కల్పించారు. గర్భిణులు ప్రతినెలా వైద్య పరీక్షలు చేయించుకుంటూ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వారికి అవసరమైన మందులు అందించారు. అనంతరం ఓఆర్ఎస్ ద్రావణాన్ని తయారు చేసే విధానం, తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. ఎంపీహెచ్ఓ ఎ.రాజమోహన్, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నల్లజర్ల: ఏలూరులోని ఆంధ్రా హాస్పిటల్ వైద్య బృందం నల్లజర్ల పీహెచ్‌సీలో గర్భిణులకు వైద్య సేవలు అందించారు. సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టరు వి.సునీత దాదాపు 80 మంది గర్భిణులకు పరీక్షలు చేశారు. వారికి సూచనలు, సలహాలు అందించారు. మందులు పంపిణీ చేశారు. నల్లజర్ల పీహెచ్‌సీ వైద్యులు గంగాధరరావు, సిరాజుద్దీన్, సీహెచ్ఓ పలివెల ప్రసాదరావు, సిబ్బంది పాల్గొన్నారు.

చాగల్లులో పశు వైద్య సేవలు

చాగల్లు: పాడి రైతుల ఆర్థికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని చాగల్లు పశువైద్యాధికారి ముఖేష్ అన్నారు. చాగల్లు పశు వైద్యశాలలో బుధవారం పశువులకు ఉచిత గర్భకోశ చికిత్స, చర్మవ్యాధులకు టీకాల వేశారు. డాక్టర్ ముఖేష్ పాడి పశువులను పరీక్షించి, రైతులకు అవసరమైన మందులు పంపిణీ చేశారు. వెటర్నరీ అసిస్టెంట్‌లు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

వ్యాధి నిరోధక టీకాలు వేయించుకోవాలి

చాగల్లు: మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమంలో భాగంగా గర్భిణులు, పిల్లలు క్రమం తప్పకుండా వ్యాధి నిరోధక టీకాలు వేయించుకోవాలని బ్రాహ్మణగూడెం పీహెచ్‌సీ వైద్యుడు కె.నిశిత, కేఆర్ఎల్ దేవి అన్నారు. బ్రాహ్మణగూడెం, ఊనగట్ల, దారవరం సచివాలయాలు, అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహిస్తున్న మిషన్ ఇంద్రధనస్ కార్యక్రమాన్ని బుధవారం వారు తనిఖీ చేశారు. ఐదేళ్ల పిల్లలకు, గర్భిణులకు వ్యాధి నిరోధక టీకాలు వేయించి, ఆ వివరాలను ప్రత్యేక యాప్ పోర్టల్లో నమోదు చేయాలని ఆరోగ్య కార్యకర్తలను ఆదేశించారు.

హీరో మహేష్‌బాబు జన్మదిన వేడుకలు

నల్లజర్ల: సినీ హీరో మహేష్‌బాబు జన్మదిన వేడుకలను బుధారం నల్లజర్లలోని ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు.లక్ష్మీ మల్టీప్లెక్స్ థియేటర్ వద్ద గ్రామ పెద్ద మద్దిపాటి ప్రసాద్ కేక్ కట్ చేశారు. మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా మహేష్ అభిమానులు రహదారి వెంట నీడనిచ్చే మొక్కలు నాటారు. కార్యక్రమంలో ముత్తినాని, నరేష్, ఎంపీటీసీ సభ్యుడు నేకూరి నరేష్ దిరుసుపాము శివమణి, నేకూరి చందు, బైపా కుమార్ పాల్గొన్నారు.

అతిగా పురుగు మందులు వాడొద్దు

- మిత్ర పురుగులు కూడా చనిపోతున్నాయి
- జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు
- అనంతపల్లిలో పొలంబడి



పొలంబడిలో రైతులకు సూచనలు చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు తదితరులు

నల్లజర్ల: పంటలను ఆశించే పలు రకాల చీడ పురుగులను నాశనం చేసేందుకు పర్యావరణంలో సహజ శత్రువులు (మిత్ర పురుగులు) ఉన్నాయని జిల్లా వ్యవసాయ అధికారి డాక్టర్ ఎస్.మాధవరావు అన్నారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మండలంలోని అనంతపల్లిలో నిర్వహిస్తున్న పొలంబడి నాలుగో వారం కార్యక్రమానికి బుధవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మిత్రపురుగులు, శత్రుపురుగులపై రైతులకు ఆయన అవగాహన కల్పించారు. విచక్షణారహితంగా పురుగు మందుల వినియోగంతో మిత్ర పురుగులు కూడా చనిపోతున్నాయన్నారు. పంటలపై ఏటా పురుగు మందుల పిచికారీని పెంచుకుంటూ పోవడం వల్ల అటు పర్యావరణానికి, ఇటు మనుషుల ఆరోగ్యానికి హాని కలుగుతోందని మాధవరావు హెచ్చరించారు. ఏయే మిత్ర పురుగులు పంటలకు ఏయే విధంగా ఉపయోగపడతాయో ఆయన రైతులకు వివరించారు. అనంతపల్లి ప్రాంతంలో మిత్ర పురుగులు ఎక్కువగా ఉన్నందున పురుగుమందుల వినియోగాన్ని తగ్గించాలని రైతులకు సూచించారు.

90 శాతం నాట్లు పూర్తి

జిల్లాలో ఖరీఫ్ మొత్తం సాగు విస్తీర్ణం 78,889 హెక్టార్లకు గాను ఇప్పటి వరకూ 70,716 హెక్టార్ల విస్తీర్ణంలో వరినాట్లు పూర్తయినట్టు మాధవరావు చెప్పారు. ఈ ఏడాది వరి పైరు ఆశాజనకంగా ఉందన్నారు. గతేడాది ఎకరానికి 30 బస్తాల సరాసరి దిగుబడి వస్తే ఈఏడాది 32 బస్తాల దిగుబడి వచ్చే అవకాశం ఉందన్నారు. ఆయనతో పాటు కొవ్వూరు ఏడీఏ పి.చంద్రశేఖరరావు, ఏడీఏ (డీఆర్‌సీ)లు కె.జ్యోతిర్మయి, బి.వెంకన్నబాబు, ఏవో కె.కమల్ రాజ్, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.